సాక్షి చిత్తూరు

బుధవారం । 3 । జూలై । 2024



విద్యుత్ బిల్లులు.. మారిన చెల్లింపులు

విద్యుత్ బిల్లుల చెల్లింపులపై ఆర్‌బీఐ నూతన నిబంధనలు అమలు చేస్తోంది. యూపీఐ యాప్స్‌కు చెక్ పెట్టింది. - 8లో



ఎర్రచందనం పట్టివేత

నింద్ర మండలం శ్రీరామపురం- కావునూరు రోడ్డులో పోలీసులకు ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి. - 8లో



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శ్రీవారి దర్శనానికి సుమారు 8 గంటల సమయం పడుతోంది. - 8లో

న్యూస్‌రీల్

మైనింగ్ తనిఖీలకు ప్రత్యేక బృందాలు



కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మైనింగ్‌లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. మంగళవారం ఆయన ఈ మేరకు ప్రత్యేక బృందాలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకే తనిఖీలు చేపట్టినట్టు వెల్లడించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పీఆర్, సెబ్ ఇతర శాఖల అధికారులు, జిల్లా స్థాయిలో డీఆర్‌ఓ, మైన్స్ ఏడీ, ఏఎస్పీ, ఇతర అధికారులతో బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 31 మండలాల్లో విస్తృతంగా పర్యటించి తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా చెక్‌లిస్ట్ తయారు చేశామని, ఆ మేరకు, బృందాలు తనిఖీలు నిర్వహించి ఈ నెల 10వ తేదీలోపు కలెక్టరేట్‌కు నివేదికలు పంపించాలని స్పష్టం చేశారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

నగరి: నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్టులు బోధిందుకు తాత్కాలిక ప్రాతిపదికపై అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంఏ పోస్ట్ గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, రాజనీతి శాస్త్రంలో ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ–నెట్/ఏపీసెట్/ఏపీస్లెట్ పూర్తిచేసిన వారికి రాజనీతిశాస్త్రంలో ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. అలాగే కంప్యూటర్ అప్లికేషన్స్‌కు ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్ పీజీ కలిగి, ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ–నెట్/ఏపీసెట్/ఏపీస్లెట్ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ ఉదయం 11.30 గంటలకు కళాశాలకు హాజరు కావాలని సూచించారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీకి పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్ పరీక్షల్లో మెరిట్ మార్కుల ఆధారంగా 200 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టయిఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని వెల్లడించారు. బీఈడీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు బీఈడీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని కోరారు. ఆధార్, బ్యాంక్ పాస్‌పుస్తకం, 3 పాస్‌పోర్టుసైజ్ ఫోటోలు జతచేసి ఈ నెల 10వ తేదీలోపు తిరుపతిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలన్నారు. వివరాలకు 9346221553, 9490733351, 9441456039 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

షాడో ఎమ్మెల్యేలు!



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అదితిసింగ్‌తో కలసి సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు శివకుమార్

వాళ్లు ఎమ్మెల్యేలు కాదు. కనీసం పంచాయతీ వార్డు సభ్యులు, మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు కూడా కాదు. వారికి ఉన్న హోదా ఒక్కటే. ఒకరు ఎమ్మెల్యే అన్న కొడుకు అయితే.. మరొకరు ఎమ్మెల్యే భార్య మాత్రమే. ఇప్పుడు ప్రభుత్వ కార్యక్రమాల్లో వారిదే హవా. ప్రభుత్వ నిధులతో చేపట్టే ఏ కార్యక్రమం అయినా సరే ఈ షాడో ఎమ్మెల్యేలు పాల్గొంటూ అడ్డదిడ్డంగా అధికారులకు ఆదేశాలిస్తున్నారు. ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులను సైతం సభావేదికలపై పక్కన నిలబెట్టి కుర్చీల్లో పాగా వేస్తున్నారు. ఐఏఎస్ స్థాయి అధికారులతోనూ సమీక్షలు నిర్వహిస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. అది ఎక్కడ.. ఎవరు.. ఎలా.. అంటారా..? అయితే మీరే చదవండి!

పదవి ఒకరిది..పెత్తనం మరొకరిది!

- తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వింత పరిస్థితులు
- షాడో ఎమ్మెల్యేల తీరుతో తలలు పట్టుకుంటున్న అధికారులు
- అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అడ్డదిడ్డంగా ఆదేశాలు
- విస్తుపోతున్న ప్రజలు

సాక్షి తిరుపతి టాస్క్‌ఫోర్స్: రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఎమ్మెల్యేలు ఒకరైతే పెత్తనం చలాయించడానికి షాడోలుగా కుటుంబ సభ్యులు మారిపోతున్నారు. అధికారిక కార్యక్రమాల్లో సైతం దర్జాగా పాల్గొంటూ అధికారులను బెంబేలెత్తిస్తున్నారు. తామే సుప్రీం అంటూ.. మేము చెప్పిందే ఫైనల్ అంటూ హుకుం జారీ చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి నెలరోజులు గడవక ముందే తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో ప్రజలకు వింత పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎలాంటి హోదా లేకున్నా గ్రామసభలు మొదలు.. ఐఏఎస్ స్థాయి అధికారులతో సైతం సమీక్షలు జరుపుతూ కనుసైగతో పాలనను తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యేల బంధువుల పెత్తనాన్ని అధికారులు విధిగా భరిస్తున్నారు. వీరి తీరును చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రాజకీయ విశ్లేషకులు సైతం షాడో ఎమ్మెల్యేల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఎమ్మెల్యే అన్న కొడుకు చేతిలో తిరుపతి

తిరుపతి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు గెలుపొందిన విషయం అందరికీ తెల్సిందే. అధికారంలోకి వచ్చిన మరునాటి నుంచే తిరుపతిని ఆయన అన్న కొడుకు ఆరణి శివకుమార్ తన చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు ప్రయత్నించారు. ఇందుకు తగ్గట్టే కార్యకలాపాల వ్యవహారాల బాధ్యతలను తన అన్న కొడుకైన శివకుమార్‌కు అప్పగించారనే ప్రచారం జరుగుతోంది. అధికారుల బదిలీల మొదలు కాంట్రాక్ట్ వర్క్స్, ఇతర లావాదేవీలపై ప్రధానంగా దృష్టి సారించారు. నియోజకవర్గ పరిధిలోని అధికార యంత్రాంగం అంతా ఆయన్ని ప్రసన్నం చేసుకునే పనిలో పడింది. ఇదిలా ఉంటే గడిచిన రెండు రోజులుగా ఆరణి శివకుమార్‌కు ఎలాంటి హోదా లేకపోయినా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం తీవ్ర దుమారం రేపింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఐఏఎస్ అధికారి అదితి సింగ్ సమక్షంలోనే సమీక్షను నిర్వహించడం చర్చించనీయశమైంది. ఏకంగా కమిషనర్ పక్కనే ప్రత్యేక కుర్చీలో కూర్చుని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇక అంతా తానేనని.. తాను చెప్పిందే శాసనం అంటూ రివ్యూ ద్వారా చాటి చెప్పాడు. అధికారులు చేసేది లేక ఆయన చెప్పినదానికి తలూపక తప్పలేదు. ఇలానే మరో నలుగురు వ్యక్తులు ఎమ్మెల్యే బంధువులమంటూ విభాగాల వారీగా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ప్రధానంగా ఇంజినీరింగ్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల్లో వీరి పెత్తనం మరింత ఎక్కువవుతోంది. ప్రతి రోజూ విభాగాధిపతుల వద్దకు వెళ్లి ఎమ్మెల్యేకు తాము సమీప బంధువులమంటూ హల్‌చల్ చేస్తున్నారు. అంతేకాకుండా మార్పులు, చేర్పులపై ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో అధికారులు ఎవరి మాట వినాలో తెలియక తికమకపడుతున్నారు.

తిరుపతిలో షాడో వ్యవహారాలు మానుకోవాలి

> తిరుపతి నగరంలో ఎమ్మెల్యే తన బంధువులు, కుమారులను పంపి సమీక్షలు నిర్వహించడం మానుకోవాలి. ఏ హోదా లేకపోయినా ఉన్నత స్థాయి అధికారులతో కూర్చుని మాట్లాడడం సబబుకాదు. ఇలాంటి కొత్త సంస్కృతి తిరుపతిలో అమలు చేయడం మంచిది కాదు.
>
> – కందారపు మురళి, సీపీఎం, తిరుపతి

చంద్రగిరిలో వింత పరిస్థితి



సోమవారం మంగళంలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి సుధారెడ్డి

మహిళలు ప్రజాప్రతినిధులుగా ఉన్న చోట వారి భర్తలు అధికారం చలాయించడం ఇప్పటి వరకు చూసి ఉంటారు. అయితే చంద్రగిరిలో అందుకు విరుద్ధంగా వింత పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని భార్య సుధారెడ్డి సోమవారం మంగళంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొనడం విస్మయానికి గురిచేస్తోంది. ఆమె అతిథిగా హాజరై ఏకంగా రాజకీయ ప్రసంగం చేయడం చర్చినీయాశంగా మారింది. ఆమె సభావేదికపై కూర్చొని ఉండగా ఎన్నికల్లో గెలిచిన వార్డు మెంబర్లు పక్కన నిలబడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే స్థానంలో ఆయన భార్య అధికారిక సభల్లో పాల్గొనడం జిల్లాలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఈ కొత్త సంస్కృతిని అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎమ్మెల్యే నానినా లేదా ఆయన భార్య సుధారెడ్డా అనే అంశంపై అంతా గుసగుసలాడుతున్నారు.

రోజూ తనిఖీలు చేస్తా!

- ఏరియా ఆస్పత్రిలో బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి హల్‌చల్
- పారిశుద్ధ్య సిబ్బందిపై చిందులు
- నిర్వహణ సరిగా లేదంటూ అసహనం



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి: 'అలూలేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం..' అన్నట్టు ఉంది శ్రీకాళహస్తిలో బొజ్జల బృందమ్మ పరిస్థితి. తెలుగుదేశం పార్టీలో ఆమెకు ఏ హోదా లేకపోయినా.. ఏ నామినేటెడ్ పోస్టు ఇవ్వకపోయినా.. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి, మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి హోదాతో హల్‌చల్ చేస్తూ రెచ్చిపోతున్నారు. ఇటీవల తన కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం సాధించినప్పటి నుంచి శ్రీకాళహస్తిపై పట్టు సాధించేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. తన కుమారుడు హైదరాబాద్‌లో మకాం వేయగా.. స్థానికంగా ఆమె పాగా వేసి సమావేశాలు, పింఛన్ల పంపిణీ, ఆలయాల్లో పూజలు, ఆస్పత్రుల్లో తనిఖీలు ఇలా ఎక్కడ చూసినా ప్రత్యక్షమైపోతున్నారు. సభలు, సమావేశాల్లో ప్రజాప్రతినిధులను నిలబెట్టి ప్రసంగాలు దంచేస్తున్నారు. తాజాగా మంగళవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. అన్ని విభాగాలను చూసి పారిశుద్ధ్యం బాగోలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న సిబ్బందిపై చిందులు తొక్కారు. బల్లలు, కుర్చీలు చిలుము పట్టి ఉన్నాయని, నిర్వహణ సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు తనిఖీ చేశానని, ఇక ప్రతిరోజూ ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేస్తూ ఉంటానని అక్కడి వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందిని పెట్టుకుంటామన్నారు. ఓపీ తగ్గిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల్లో కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తానని చెప్పుకొచ్చారు. దీంతో అక్కడ ఉన్న రోగులు ఔరా..! అంటూ ముక్కున వేలేసుకున్నారు.

పకడ్బందీగా కొత్త చట్టాల అమలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

- మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి
- సైబర్ మోసాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలి
- నేర సమీక్షలో ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్ : భారతీయ శిక్షాస్మృతి స్థానంలో అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఐపీసీ స్థానంలో వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) చట్టాలు ఈనెల ఒకటో తేదీ నుంచే అమల్లోకి వచ్చాయన్నారు. వీటిని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇప్పటికే కొత్త న్యాయ చట్టాలపై పోలీసులకు అవగాహన కూడా కల్పించామన్నారు. నూతన చట్టాలపై ఎస్ఐ నుంచి డీఎస్పీ స్థాయి అధికారి వరకు నిత్యం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ప్రధానంగా గంజాయి ఎక్కడి నుంచి జిల్లాలోకి వస్తోంది..? రవాణా ఎలా జరుగుతోంది..? ప్రధాన సూత్రధారులు ఎవరు..? అనే విషయాన్ని నిశితంగా కనిపెట్టాలని కోరారు. సరిహద్దులు దాటి కర్ణాటక మద్యం జిల్లాలోకి రాకూడదద స్పష్టం చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తిచేసి, కోర్టుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. సాక్ష్యాల సేకరణలో దర్యాప్తు అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని, నిందితులు తప్పించుకోవడానికి వీల్లేకుండా చూడాలని సూచించారు. సైబర్ క్రైమ్ నేరాల బారిన పడకుండా ప్రజలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. ఇందుకోసం ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సైబర్ మోసాలకు గురైన వాళ్లు 9440900005, 9121211100 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరిగేలా చూడాలని కోరారు. రాత్రి గస్తీలు పెంచాలని, వీలైనంత ఎక్కువ సంఖ్యలో పోలీసులు రోడ్లపై కనిపించేలా డీఎస్పీలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు అధికారులను అభినందించారు. సమావేశంలో ఏఎస్పీలు ఆరీఫుల్లా, సుబ్బారావు పాల్గొన్నారు.

పుంగనూరు టీడీపీలో వర్గపోరు





పుంగనూరులో అమరనాథరెడ్డి ఫ్లెక్సీలను చించివేసిన దృశ్యం

పుంగనూరు : పట్టణంలోని టీడీపీ నేతల మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. అధికారంలోకి వచ్చి నెల కూడా గడవక ముందే ఆధిపత్య పోరు మొదలవడంపై ఆ పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. వివరాలు.. మంగళవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పుట్టినరోజు వేడుకలను పుంగనూరు పట్టణంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక గోకుల్ సర్కిల్‌తోపాటు కొన్ని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే అమర్ అభిమానుల సంబరాలు జరుపుకున్న కొన్ని గంటల్లోనే వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను టీడీపీకి చెందిన మరో వర్గం నేతలు చించివేశారు. దీంతో అమరనాథరెడ్డి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 40 ఏళ్లుగా అమరనాథరెడ్డి, ఆయన తండ్రి రామకృష్ణారెడ్డికి ఎంపీ, ఎమ్మెల్యేలుగా పుంగనూరుతో ఎంతో అనుబంధం ఉందని వెల్లడిస్తున్నారు. అయితే గత ఐదేళ్లుగా వారి ఊసే లేకుండా పుంగనూరులో టీడీపీ కార్యక్రమాలు నిర్వహించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీలో విభేదాలను గమనిస్తున్న పుంగనూరు వాసులు టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరిందని చర్చించుకుంటున్నారు.

నాణ్యతతో నిర్మాణ పనులు



వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



సదుం : అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చౌడేపల్లె : ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పాలిటెక్నిక్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కాటిపేరి పంచాయతీ అగిస్తిగానిపల్లె సమీపంలో సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన కళాశాల భవన నిర్మాణ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా నిధుల మంజూరు, భవన సముదాయం మ్యాప్‌ను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పదోతరగతి పాసైన విద్యార్థులు రెండేళ్ల డిప్లొమా కోర్సును పూర్తిచేస్తే ఉపాధి అవకాశం పొందవచ్చన్నారు. ఆధునికత సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని వ్యవసాయం చేస్తే అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఈ శివప్రసాద్, ప్రిన్సిపల్ నజీరుద్దీన్, తహసీల్దార్ శ్రీరాముడు, ఆర్ఐ సుధాకర్ నాయక్, వీఆర్‌ఓ వేణు పాల్గొన్నారు.

వెటర్నరీ డిప్లొమాతో ఉపాధి

సదుం: వెటర్నరీ డిప్లొమా చదివితే మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని కలెక్టరు సుమిత్ కుమార్ తెలిపారు. మంగళవారం సదుంలో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వెటర్నరీ పాలిటెక్నిక్ భవనాలను ఆయన పరిశీలించారు. పశు ఆధారిత రంగంపై ఆసక్తిగల వారు వెటర్నరీ కోర్సులను పూర్తి చేసి ఉపాధి అవకాశాలు ఏర్పరచుకోవాలన్నారు. నాణ్యతాప్రమాణాల మేరకు భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ ఫండ్ కింద పనులు చేపడుతున్నట్టు చెప్పారు. నిర్మాణాలపై అధికారులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ శివప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, తహసీల్దార్ నారాయణ స్వామి, ఎంపీడీఓ రాజశేఖర్ బాబు, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, ప్రిన్సిపల్ యశిష్ట పాల్గొన్నారు.

పెరిగిన ఎన్ఎంఆర్‌ల వేతనం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ (డైలీవేజ్ ఉద్యోగి), మజ్దూర్ కార్మికుల వేతనాలు పెంచుతూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఆర్‌ఓ పుల్లయ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్ 1వ తేదీ నుంచి జీతాలు పెంచినట్లు వెల్లడించారు. గత ఏడాది చెల్లించిన జీతం కంటే ఐదు శాతం పెంచి చెల్లించాలని నిర్ణయించారని వివరించారు. ఆ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం లేని కార్మికులకు రోజుకు రూ.538, మున్సిపాలిటీల్లో రూ.621, కార్పొరేషన్‌లో రూ.678 వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్ధ నైపుణ్యం ఉన్న వారికి గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు రూ.565, మున్సిపాలిటీల్లో రూ.652, కార్పొరేషన్‌లో రూ.712, పూర్తి నైపుణ్యం ఉన్న వారికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.594, మున్సిపాలిటీల్లో రూ.685, కార్పొరేషన్‌లో రూ.749 వేతనాలు చెల్లించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార్‌రావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, కుప్పం ఆర్‌డీఓ శ్రీనివాసులు, కాణిపాకం ఆలయం ఏఈఓ రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి


మాట్లాడుతున్న బాధితుడు రాజశేఖర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఎస్‌ఆర్‌పురం మెదవాడ గ్రామానికి చెందిన విశ్వనాథంనాయుడు కుమారుడు జ్యోతిప్రకాష్ కుటుంబం నుంచి తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని ఆ గ్రామానికే చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి విన్నవించారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నానన్నారు. జ్యోతిప్రకాష్ తన స్నేహితుడని, నిరుద్యోగి కావడంతో ఆర్థికంగా ఆదుకునేవాడినని తెలిపారు. అతని జీవనోపాధి కోసం రూ.9.20 లక్షలు ఇచ్చి సప్లయర్స్ షాపు పెట్టించానన్నారు. తర్వాత తన డబ్బులను తిరిగి ఇవ్వమని అడిగితే జ్యోతిప్రకాష్, విశ్వనాథనాయుడు, సోమశేఖర్‌నాయుడు, ఢిల్లీబాబు దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించేందుకు యత్నించారని ఆరోపించారు. చివరకు తనను చంపేందుకు సైతం యత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని, ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.

ఎర్రచందనం పట్టివేత

నింద్ర : మండలంలోని శ్రీరామపురం–కావునూరు రోడ్డులో సోమవారం రాత్రి కారులో తరలిస్తున్న ఎర్రచందనం దుంగలు పోలీసులకు పట్టుబడ్డాయి. వివరాలు.. ఎర్రచందనం స్మగ్లింగ్‌పై అందిన సమాచారం మేరకు పోలీసులు కాపు కాసి కారును వెంబడించారు. ఈ విషయం గమనించిన ఎర్రదొంగలు రోడ్డు పక్కన పొలంలో కారును వదిలేసి పరారయ్యారు. దీంతో పోలీసులు కారులోని రూ.5లక్షల విలువైన ఎర్రదుంగలను స్వాధీనం చేసుకున్నారు. కారు విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని సీఐ సుబ్బిరామిరెడ్డి, ఎస్‌ఐ రామచంద్ర తెలిపారు. పారిపోయిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

సలహా మండలి సమావేశాలు రద్దు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. మరోవైపు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. ఆ మేరకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. గత ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు సాంకేతిక మార్పులను తీసుకురావడానికి, అన్నదాతలకు అమూల్యమైన సలహాలు ఇవ్వడానికి మూడు దశల్లో సలహా మండలి సమావేశాలు నిర్వహించేలా కొత్త సంస్కరణ తీసుకొచ్చారు. దీంతో రైతులకు సేద్యం చేయడానికి అవసరమైన అన్ని సలహాలు అందించేవారు.

విద్యుత్ బిల్లులు.. మారిన చెల్లింపులు

- ఎస్పీడీసీఎల్ సైట్‌లో కట్టే అవకాశం
- యూపీఐ యాప్‌లకు చెక్ పెట్టిన ఆర్‌బీఐ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లులను ఇకపై సంస్థకే నేరుగా చెల్లించాలని ట్రాన్స్‌కో ప్రకటించింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఏపీఎస్పీడీసీఎల్ సైట్ లేదా ఎపీఎస్పీడీసీఎల్ యాప్‌లో మాత్రమే బిల్లు పేమెంట్ చేయాలని స్పష్టం చేసింది. యూపీఐ యాప్‌లైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో బిల్లు చెల్లించే ఆప్షన్‌ను నిలిపివేసినట్లు వెల్లడించింది. విద్యుత్‌శాఖ కార్యాలయానికి నేరుగా వెళ్లి చెల్లిస్తే మేలని వినియోగదారులకు సూచిస్తోంది.

ఆర్‌బీఐ నిబంధనలు

సమయపాలన పాటిస్తూ గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి కరెంటు బిల్లులు కట్టే కాలం పోయింది. గతంలో కంటే ప్రస్తుతం ఆన్‌లైన్ వాడకం పెరిగింది. ఎల్‌టీ సర్వీసులు అధిక భాగం బిల్లులు మొత్తం ఆన్‌లైన్‌లోని యూపీఐ ద్వారా చెల్లిస్తున్నారు. మొదట్లో లావాదేవీలను ప్రోత్సహించాలని యాప్‌లో సర్వీసు చార్జీలు వసూలు చేసేవారు కాదు. కానీ, గత ఏడాది నుంచి నామమాత్రపు చార్జీలను యూపీఐ యాప్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయితే జూలై 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు లైసెన్స్ అవసరమని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్స్ పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం బిల్ పేమెంట్ ఆప్షన్‌ను తొలగించేశాయి.

కారణం ఇదీ..

ఆన్‌లైన్ చెల్లింపుల్లో మూడో పార్టీ యాప్స్ అయిన ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో కరెంటు బిల్లు కడితే విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడానికి మూడు రోజులు సమయం పడుతోంది.


Southern Power Distribution Company of A.P. Ltd
దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ
విద్యుత్ వినియోగదారులకు
APSPDCL కీలక సూచన.
ప్రియమైన విద్యుత్ వినియోగదారులారా...
RBI ఆదేశాల ప్రకారం UPI సర్వీస్ ప్రొవైడర్లయిన ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే, గూగుల్ పే, బ్యాంకుల ద్వారా కరెంట్ బిల్లుల చెల్లింపులు నిలిపివేస్తున్నాం. ఈ క్రమంలో నేటి నుంచి APSPDCL వెబ్సైట్ www.apspdcl.in ద్వారా లేదా APSPDCL మొబైల్ యాప్ ద్వారా మాత్రమే నెలవారీ కరెంట్ బిల్లులు చెల్లించాలని వినియోగదారులను సవినయంగా కోరుతున్నాము.
ఇట్లు...ఎం.మునిచంద్ర
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆపరేషన్,
ఎపిఎస్పిడిసియల్, చిత్తూరు

ప్రత్యక్ష చెల్లింపులు చేయాలని విద్యుత్‌శాఖ సమాచారం

అలాగే కొన్ని పేమెంట్స్ పలు కారణాలతో నిలిచిపోతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడం ఆలస్యమతోంది. అదే ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లు చెల్లిస్తే నేరుగా సంస్థ ఖాతాలోకే వస్తోంది. దీంతో యూపీఐ యాప్స్‌లో నగదు చెల్లించినా, నేరుగా ఎస్పీడీసీఎల్ ఖాతాలో జమ కావాలని ఆర్‌బీఐ నిబంధన విధించింది. అందులో భాగంగా యాప్స్ యాజమాన్యాలు పలు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అవి పూర్తయ్యాక పాత విధానం అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

75 శాతం ఆన్‌లైన్

జిల్లాలో గృహ, వాణిజ్య సర్వీసులు దాదాపు 14.50 లక్షల వరకు ఉన్నాయి. ఇవి కాకుండా హెచ్‌టీ, పరిశ్రమల సర్వీసులు 50 వేల వరకు వినియోగిస్తున్నారు. మొత్తం విద్యుత్‌బిల్లుల ద్వారా జిల్లాలో నెలకు రూ.320 కోట్లు వస్తోంది. ఇందులో రూ.129 కోట్లు గృహ, వాణిజ్య సర్వీసులు ద్వారా మిగిలిన రూ.191 కోట్లు పరిశ్రమలు, హెచ్‌టీ సర్వీసుల ద్వారా వస్తోంది. పరిశ్రమల చెల్లింపులు బ్యాంకు ద్వారా చేస్తున్నారు. మిగిలిన వాటిలో 60 శాతం మంది ఆన్‌లైన్ ద్వారా కడుతున్నారు. జిల్లాలో 8.70 లక్షల సర్వీసుల బిల్లులు దాదాపు రూ.77.50 కోట్లు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారానే వస్తోంది.

ఆ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించండి



“ ఏపీఎస్ పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా www.apspdcl.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలి. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలతోపాటు ఇతర యూపీఐ యాప్స్ ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించే అవకాశం లేదు. వెబ్‌సైట్ ద్వారా బిల్ డెస్క్‌కు అనుసంధానమైన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎమ్ ఇతర యూపీఐ యాప్స్ నుంచి బిల్లులను చెల్లించవచ్చు. వీటితోపాటు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డుల ద్వారా కూడా బిల్లు చెల్లించవచ్చు. – సంతోష్‌రావు, ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

సరసమైన ధరకే కందిపప్పు


కందిపప్పు విక్రయాలు ప్రారంభిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు అగ్రికల్చర్: సామాన్యులకు సరసమైన ధరకే కందిపప్పును ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన నగరంలోని రైతు బజారులో కందిపప్పు విక్రయ కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం కందిపప్పు ఉత్పత్తి తక్కువగా ఉన్నందున మార్కెట్‌లో డిమాండ్ పెరిగిపోయిందన్నారు. కిలో రూ. 175 నుంచి రూ. 200 వరకు ధర పలుకుతోందని వెల్లడించారు. దీంతో ప్రజలు కొనుగోలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారని, అందుకే విక్రయ కేంద్రం ద్వారా కిలో రూ.165 అందిస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే మొబైల్ వాహనాల ద్వారా టమాటాలను కూడా తక్కువ ధరకే విక్రయించేలా చర్యలు చేపట్టామని వివరించారు. రైతు బజారులో చిరు వ్యాపారులు విక్రయాలు జరుపుకునేందుకు వెసులుబాటు కల్పించామన్నారు. నగరంలో ప్లాట్‌ఫాం పై కూరగాయలు విక్రయించుకునే వారికి కూడా రైతు బజారులో స్థలం కేటాయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


ఆంధ్ర విద్యార్థి సంఘం కొత్త కమిటీ

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షు మల్లవరపు అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కొంగారెడ్డిపల్లెలోని ఓ కార్యాలయంలో సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పవన్‌కుమార్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఈసం బట్టు పునీత్, నియోజకవర్గ కన్వీనర్‌గా చరణ్‌తేజ్, చిత్తూరు నగర అధ్యక్షుడిగా ధనుష్‌కోటి, నగర కార్యదర్శిగా లక్ష్మణ్, జిల్లా మీడియా కన్వీనర్‌గా బబు జ్యోతీష్‌యాదవ్ ఎన్నికైనట్లు వెల్లడించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్


రామిరెడ్డిపల్లి సచివాలయంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

చంద్రగిరి: చంద్రగిరి జమండ్ల వీధి, రామిరెడ్డిపల్లిలోని నూతన సచివాలయంలో మంగళవారం స్విమ్స్, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో పింక్ బస్ మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. కొత్తపేటలో గల రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో, అదేవిధంగా రామిరెడ్డిపల్లిలో గల సచివాలయంలో ఈ క్యాంపులు నిర్వహించారు. ఇందులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కాగా, గురువారం కందులవారిపల్లి, చంద్రగిరి, జూలై 5న ఏ.రంగంపేట, నరసింగాపురంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఐషర్ లారీ బోల్తా



గంగాధర నెల్లూరు : జీడీనెల్లూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం ఓ ఐషర్ లారీ బోల్తాపడింది. వివరాలు.. పుత్తూరు నుంచి చిత్తూరుకు గ్లాస్ లోడ్‌తో వెళుతున్న ఐషర్ వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనదారుడిని ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన ద్విచక్రవాహనదారుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఓపెన్ స్కూల్ మార్కుల జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చెందిన అభ్యర్థుల మార్కుల జాబితాలను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలైనట్లు చెప్పారు. ఫలితాల కోసం ఏపీ ఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో సందర్శించాలన్నారు. రీ కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున ఈ నెల 13వ తేదీలోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు.

అమ్మా.. నన్ను క్షమించండి!

- బీటెక్‌లో ఫెయిల్ అయిన ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య
- చెర్లోపల్లెలో విషాదం


గురు కల్యాణ్ (ఫైల్)

తిరుపతి రూరల్: ‘అమ్మా.. నన్ను క్షమించండి.. నేను చనిపోతున్నా’ అంటూ బీటెక్‌లో ఫెయిల్ అయిన ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. మృతుడు తండ్రి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లికి చెందిన గురుకల్యాణ్ (20) రంగంపేట సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. గత నెలలో పరీక్షల రిజల్ట్ వచ్చింది. ఇందులో కొన్ని సబ్జెక్టుల్లో గురు కళ్యాణ్ ఫెయిల్ అయ్యాడు. అప్పటి నుంచి మనస్తాపంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం షాపుకు వెళ్తొస్తానని ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సమీపంలోని కొత్తగా నిర్మిస్తున్న శ్రీవారి విడిది భవనాల పైకి వెళ్లి మూడో అంతస్తు నుంచి సెల్ఫీ తీసుకొని తన తల్లికి పంపించాడు. ‘అమ్మా...నన్ను క్షమించండి’ అంటూ మెసేజ్ చేసి మూడో అంతస్తు నుంచి కిందకి దూకాడు. కుమారుడి మెసేజ్‌తో ఆందోళన గురైన తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో గురు కళ్యాణ్ పడి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


ఇందు మృతదేహం

బంగారుపాళెం: మండలంలోని వేపనపల్లెలో మంగళవారం సాయంత్రం ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. దండువారిపల్లెకు చెందిన కరుణాకర్ కుమార్తె ఇందు (25)తో వేపనపల్లెకు చెందిన మణికంఠకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. గత కొంత కాలంగా కుటుంబ కలహాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కూడా గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన ఇందు ఇంట్లోనే ఉరివేసుకుంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వేపనపల్లెకు చేరుకున్నారు. ఇందు మృతికి గల కారణాలను ఆరా తీశారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

సత్యవేడు: అక్రమంగా గంజాయి తరలిస్తున్న కేసులో సత్యవేడు పంచాయతీకి చెందిన ఎం.కుమార్(25) గంగమిట్ట వీధి, సత్యవేడు దళితవాడకు చెందిన ఆర్.కలియప్ప(22)ను అరెస్ట్ చేసినట్టుసీఐ దివాకర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మంగళవారం ఉదయం కాళమనాయుడుపేట చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పల్సర్ బైక్ పై వచ్చిన ఇద్దరు యువకులు పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు ఇరువురినీ అడ్డగించి తనిఖీ చేయగా బైక్ ట్యాంకు కవర్‌లో ఒక కిలో గంజాయి ఉండడం గుర్తించి ఇద్దరినీ అదుపులోకి తీసుకొని తహసీల్దారు వద్ద హాజరు పరిచారు. విచారణలో యువకులు సూళ్లూరుపేట వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తు ద్వారా గంజాయి కొనుగోలు చేసి సత్యవేడు, తమిళనాడు ప్రాంతాల్లో విక్రయించేందుకు సిద్ధమైనట్టు తెలింది. కేసు దర్యాప్తులో ఉంది.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం


కాలిపోయిన సామగ్రి

పలమనేరు : పట్టణంలోని డీసీ వీధికి చెందిన గిరిధర్ అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయని, సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

నేడు గేట్ కళాశాలలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ చిగురువాడ గేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, సత్య ఇన్ఫోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువున్న విద్యార్థుల కోసం బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రముఖ ఎమ్ఎన్‌సీ కంపెనీకి చెందిన ప్రతినిధులు కస్టమర్ సర్వీస్ అడ్వైజర్, డిజిటల్ చాట్ అసోసియేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు 9000854841, 9985979770, 8885714841 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 75,449 మంది స్వామివారిని దర్శించుకోగా 27,121 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.91 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం రేపు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు మంగళవారం టీటీడీ అధికారులు తెలిపారు.. శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు జూలై 10 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవానికి ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీడగా వస్తోంది. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం.. అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. ఈ సందర్భంగా గురువారం జరగనున్న తిరుప్పావడసేవ, ఆర్జిత కల్యాణోత్సవం సేవను టీటీడీ రద్దు చేసింది.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తడ: మండల పరిధిలోని అక్కంపేట రైల్వే స్టేషన్ సమీపం, గ్రద్దగుంట కాలనీ వద్ద మంగళవారం జరిగిన రైలు ప్రమాదంలో సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు సూళ్లూరుపేట జీఆర్పీ ఎపీ ఎస్‌ఐ కే.కొండప్పనాయుడు తెలిపారు. తెలుపు రంగు చొక్కా, ఎరుపు రంగు పంచె ధరించిన ఇతని వద్ద పసుపు రంగు గుడ్డ సంచి ఉండడంతో ఇతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆచూకి తెలిసిన వారు సూళ్లూరుపేట జీఆర్‌పీ ఓపీ కార్యాలయంలో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

ఘాట్ రోడ్డులో మంటలు

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లోని 31వ మలుపు వద్ద మంగళవారం సాయంత్రం మంటలు అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న టీటీడీ విజిలెన్స్, అటవీశాఖ అధికారులు ఆ మంటలను త్వరితగతిన అదుపు చేశారు. మలుపుల వద్ద శ్రీవారి భక్తులు కర్పూరం అంటించడం వల్లే మంటలు వ్యాపించినట్లుగా విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

తిరుమల నడక మార్గంలో పటిష్ట భద్రత


మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

- టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుపతి (అలిపిరి): అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో వెళ్లే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ అటవీ, టీటీడీ అటవీ, ఇంజినీరింగ్, భద్రతా విభాగాలతో కాలిబాట భక్తుల భద్రతా చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ట్రాప్ కెమెరాలే కాకుండా చిరుతలు, ఇతర జంతువుల సంచారం తెలుసుకొనేందుకు మరిన్ని ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి ఏడో మైలు వరకు సంచరించే జంతువుల కదలికలు ఎప్పటి కప్పుడు కంట్రోల్ రూంకు తెలిసేలా సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరిచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సంయుక్త కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు చాలా కర్చుతో కూడుకున్నవని.. కమిటీ వారికి తక్కువ ఖర్చుతో అయ్యే నిర్మాణాలను, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని వారికి ఉత్తరం రాయాలని అధికారులను ఆదేశించారు. కాలినడక మార్గంలో ఏ సమయాల్లో భక్తుల రాకపోకలు అధికంగా ఉంటాయి.. ఏ సమయాల్లో చిరుతలు ఈ ప్రాంతంలో తిరుగుతున్నాయి.. తదితర సమాచారాన్ని అటవీ అధికారులు పీపీటీతో తెలిపారు. కాలినడక భక్తులకు నిర్దేశించిన సమయాల్లోనే తిరుమలకు చేరుకునేలా, ఆ సమయాల్లో మార్పులు చేయాలని ఈఓ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని జేఈఓ వీరబ్రహ్మం, సీవీ అండ్ ఎస్వో నరసింహ కిషోర్‌కు సూచించారు. సమావేశంలో ఎస్వీ జూ పార్క్ క్యూరేటర్ సెల్వం, తిరుపతి డీఎఫ్ఓ సతీష్, సబ్ డీఎఫ్ఓ శ్రీనివాస్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ– 2 జగదీశ్వర్‌రెడ్డి, టీటీడీ డీఎఫ్ఓ శ్రీనివాస్, పంచాయతీ ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.